



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, హాజరైన పారిశ్రామికవేత్తలు, సిబ్బంది

టీఎస్ ఐపాస్, టీహబ్ దేశానికే ఆదర్శం

పారిశ్రామిక ఉత్సవంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

జీడిమెట్ల: తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక ప్రగతిలో అతి తక్కువ కాలంలోనే అత్యధిక పురోగతి సాధించిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జీడిమెట్లలోని ఇండస్ట్రీస్ అసోషియేషన్ కార్యాలయంలో డీపీసీ, టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో తెలంగాణ పారిశ్రామిక ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వివేకానంద హాజరయ్యారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్, టీహబ్‌లాంటివి దేశానికే ఆదర్శమని అన్నారు.

అప్పుల తెలంగాణ కాదు.. ప్రగతి రాష్ట్రం..

తెలంగాణ రాష్ట్రం అప్పుల రాష్ట్రం కాదని ప్రగతి రాష్ట్రమని ఎమ్మెల్యే అన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ ఇప్పటికే గొప్ప అభివృద్ధి సాధించిందని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు భారతం దేశం మెచ్చిన గొప్ప ముఖ్యమంత్రి అని ఆయన కొనియాడారు. కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు స్వాగతిస్తే భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా ఉంటుందని అన్నారు.

కరెంట్ కోసం ధర్నాలు లేవు..

2012సంవత్సరంలో పరిశ్రమల విద్యుత్‌కోసం పారిశ్రామికవేత్తలు రోడ్లపై దర్నాకు దిగారని తెలంగాణ వచ్చిన తర్వాత పరిశ్రమలకు కావాల్సినంత కరెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈరోజు ప్రపంచంలోని పలు పరిశ్రమలు తెలంగాణ వైపు చూస్తున్నాయంటే తెలంగాణ ఎంత ప్రగతి సాధించిందో తెలుస్తుందని ఆయన తెలియజేశారు. తెలంగాణలో ఉపాధి అవకాశాలు ఎంతగానో పెరిగిపోయాయని తెలిపారు. కేటీఆర్ లాంటి గొప్ప మంత్రి రాష్ట్రానికే ఆదర్శమని అన్నారు.

కుత్బుల్లాపూర్‌లో పెరిగిన పరిశ్రమలు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ కంటే ముందు 1వెయ్యి పైచిలుకు పరిశ్రమలు ఉన్న కుత్బుల్లాపూర్‌లో ప్రస్తుతం 2195 పరిశ్రమలు ఉన్నాయని అన్నారు. పరిశ్రమలు పెరగడంతో 33700మందికి ఉపాధి లభించిందని తెలిపారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ అభివృద్ధి కోసం 370కోట్ల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో జేఐఏ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఐలా చైర్మన్ సదాశివరెడ్డి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి, ఐలా కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్‌రెడ్డి, పీడీఎస్ఎన్‌రాజు, కృష్ణ, ఎఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద

రంగారెడ్డినగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకువెళ్తున్నారని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్, న్యూషాపూర్‌నగర్‌లకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మహిళా కార్యకర్తలు మంగళవారం దళిత సంఘాల ఐక్య వేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు అరుణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో ప్రతి ప్రాంతానికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్ డివిజన్ ప్రగతియాత్ర

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీనగర్, సౌభాగ్యనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రగతియాత్ర నిర్వహించారు. స్థానికంగా పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన మిగతా పనులను సైతం త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జయరాం, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'సాగునీటి దినోత్సవ'ఏర్పాట్ల పరిశీలన..

◆ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుండిగల్ చెరువు వద్ద నిర్వహించనున్న ‘సాగునీటి దినోత్సవ’ఏర్పాట్లను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సభలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ సురేష్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, గోపాల్ రెడ్డి, ఆనంద్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నల్తూరి కృష్ణ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీలకు చెందిన మహిళలు

క్లుప్తంగా

బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి

బాలానగర్: మహిళా రెజ్లర్లపైన లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని బాలానగర్ సీఐటీయూ మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం కమిటీ సభ్యులు భవన నిర్మాణ కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడారు. దేశానికి గోల్డ్ మెడల్స్ తీసుకొచ్చిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు దంపతులు

దుండిగల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి కల్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. 75 సంవత్సరాలుగా తెలంగాణాలో జరగని అభివృద్ధి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిందని ఎమ్మెల్సీ అన్నారు.

◆ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దంపతులు సర్పాపూర్ సమీపంలోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


ఇలా చేస్తే ఎలా.?



వుడ్స్ కాలనీలో రోడ్లపై మోటార్లతో నీళ్లు వదలడంతో చిత్తడిగా మారిన రహదారి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వుడ్స్ కాలనీలో ప్రధాన రోడ్డుపై ఇలా మోటార్ల ద్వారా నీటిని తోడడంతో అటు వైపుగా రాకపోకలు సాగించే అవకాశం లేకుండాపోతోంది. ఇప్పటికే కాలనీలోని అన్ని రోడ్లు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఇలా మోటార్ల ద్వారా నీటిని రోడ్డుపై వదలడం మూలంగా ఉన్న రోడ్డు కాస్త వాహనాలు రాకుండా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కాలనీ ప్రధాన కార్యదర్శి భిక్షపతి పేర్కొన్నారు. కాలనీ పక్కనే ఉన్న గేటెడ్ కమ్యూనిటీ నుంచి మోటర్లు పెట్టి ఇలా వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

తాగునీరు రోడ్డుపాలు



వృథాగా పోతున్న తాగునీరు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలోని చర్చి వద్ద కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతియుతంగా నిరసన తెలపాలి



సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు నచ్చచెబుతున్న జీడిమెట్ల సీఐ

జీడిమెట్ల: ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతియుతంగా నిరసన తెలియజేయాలని జీడిమెట్ల సీఐ పవన్ సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు తెలిపారు. మూడు నెలలుగా కార్మికులకు న్యాయం చేయాలంటూ సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ ఏదుట రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్నారు. అయినప్పటికి న్యాయం జరగకపోవడంతో మంగళవారం కార్మికులు రోడ్డుపైకి వచ్చి ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు జీడిమెట్ల డిపో వద్దకు చేరుకుని కార్మికులతో మాట్లాడి వారిని సముదాయించి పరిశ్రమ వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం సీఐ కార్మికులతో మాట్లాడుతూ.. కార్మికులు ప్రజలకు ఆటంకం కలగకుండా చూసుకోవాలని వారికి సూచించారు. అనంతరం కార్మికులు తిరిగి పరిశ్రమ వద్ద దీక్షకు దిగారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఎట్టి పరిస్థితుల్లో దీక్ష విరమించేది లేదని కార్మికులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తోంది

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన యువకులు పున్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. అప్పుడే మార్పు సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే భారీ ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామని తెలిపారు.



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డిని కలిసిన యువకులు

బాచుపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బడిబాట

నిజాంపేట్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణత సాధిస్తున్నాయని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం బాచుపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బసప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిర్వహించిన అవగాహన ర్యాలీని సుధాకర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఉచితంగా స్కూల్ డ్రెస్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.



బడిబాటను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుధాకర్‌ముదిరాజ్, హెచ్ఎం బసప్ప

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని ఆకృతి అపార్ట్‌మెంట్స్ సమీపంలో రూ.8 లక్షల నిధులతో చేపట్టున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వసతులను కల్పిస్తున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కుమార్ రెడ్డి, హరి బాబు, ఇంజినీర్ అరుణ్, కాలనీవాసులు రమేష్, నాగిరెడ్డి, శివకుమార్, జీవన్‌రెడ్డి, మాధురి, రజిత, నర్సింహారావు, కాంట్రాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

పారిశ్రామిక ప్రగతిలో మేడ్చల్‌కు ప్రథమ స్థానం

ప్రగతి కార్యక్రమంలో మంత్రి సీహెచ్ మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామిక ప్రగతిలో దేశంలోనే తెలంగాణ దూసుకెళ్తోందని, దీనికి సీఎం కేసీఆర్ కృషి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పట్టుదల కారణమని మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో మేడ్చల్ తెలంగాణలో మొదటిస్థానంలో ఉండటం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని విష్ణుల్యాబ్స్ లిమిటెడ్, జినోమ్ వాలీలో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వినూత్న, పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో తెలంగాణ కేరాఫ్‌గా మారిందన్నారు. తెలంగాణకు ఎన్నో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, గతంలో మాదిరిగా ఎలాంటి పవర్ హాలీడేలు లేకుండా 24 గంటల విద్యుత్తు అందించడం వల్లే సాధ్యమవుతోందన్నారు. కరోనా సమయంలో జీనోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ కనిపెట్టడం ప్రపంచానికే గర్వకారణమని తెలిపారు. ఈ కరోనా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు 35 శాతం అందించిందన్నారు. ఇలాంటి పెద్ద పరిశ్రమ మేడ్చల్ నియోజకవర్గంలో ఉండటం అదృష్టమన్నారు.

టీఎస్ ఐపాస్ వల్ల ఎంతో అభివృద్ధి: కలెక్టర్ అమయ్‌కుమార్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్‌తో ఎంతో అభివృద్ధి జరుగుతోందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. టీఎస్–ఐపాస్‌తో కొత్త పరిశ్రమల స్థాపన, వాటికి అనుమతులు సులభతరం అయ్యాయన్నారు. ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ దేశంలోని ఇతర రాష్ట్రాలను అధిగమించి ప్రథమ స్థానంలో నిలిచిన తీరును ఆయన వివరించారు. జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, పాల్గొన్నారు.



దుస్తుల పంపిణీ

చింతల్: బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొట్టే రాజాసదానంద్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులకు బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కొట్టె రాజాసదానంద్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐటీఐలో చేరేందుకు 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషన్, ఎలక్ట్రానిక్స్ వంటి ట్రేడ్స్‌లలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు www.iti.teanfana.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కేసీఆర్ ఎన్నికల జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు



శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహించిన పాదయాత్రలో అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: దశాబ్ది ఉత్సవాల పేరిట అధికారులు కార్యాలయాలకు రాకపోవడంతో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ‘కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్, సాయినగర్, శివారెడ్డినగర్, న్యూ వివేకానంద్‌నగర్ కాలనీల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

◆ అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ఏం సాధించారని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట అధికారులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ఉత్సవాలను నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

◆ ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు నటరాజ్ గౌడ్, గరిగే శేఖర్ ముదిరాజ్, నల్లా జయశంకర్ గౌడ్, జగన్ మోహన్‌రావు, డివిజన్ ఇంచార్జులు కృష్ణ యాదవ్, మోతె శ్రీనివాస్, మహిళా మోర్చా అసెంబ్లీ కోకన్వీనర్ అలివేలు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 11న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను మేడ్చల్ జిల్లాలో 49,660 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తుండగా, వీరి కోసం 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

తల్లి మందలించిందని చెరువులో దూకి బాలిక ఆత్మహత్య

నిజాంపేట్: ప్రతి రోజు గంటల తరబడి సెల్‌ఫోన్‌లో గడుపుతుండటాన్ని గమనించిన తల్లి కూతురిని మందలించింది. దీంతో ఆ బాలిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ఉమా బాచుపల్లి ప్రాంతానికి వచ్చి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఉమాకు ఒక కొడుకు, కూతురు(16) ఉంది. 10వ తరగతి వరకు చదివిన కూతురు కుటుంబ ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో చదువు మానేసింది. దీంతో తల్లికి చేదోడు వాదోడుగా కూతురు సైతం పని చేస్తూ ఉండేది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కూతురు ఎక్కువ సేపు ఫోన్ మాట్లాడడాన్ని గమనించి తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన బాలిక బాచుపల్లిలోని భైరుని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికి అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేక్‌ల గోడౌన్‌పై ఎస్ఓటీ పోలీసుల దాడులు

నిజాంపేట్: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కేక్‌లు తయారు చేస్తున్న ఓ కేక్‌ల గోడౌన్‌పై బాలనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేట్‌లో బాలాజీ కేక్ గోడౌన్‌లో నాణ్యత లేకుండా కేక్‌లు తయారు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు మంగళవారం ఈ దాడులు నిర్వహించారు. గోడౌన్‌లో శుభ్రత పాటించకుండా కేక్‌లను తయారు చేస్తున్నారని గుర్తించారు. అదే విధంగా కేక్ నాణ్యత సైతం లేదని ఎస్ఓటీ పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి సమష్టిగా పనిచేయాలి

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారుల సమష్టిగా కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న బాచుపల్లి భైరుని చెరువు వద్ద దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఇరిగేషన్, ఆయా విభాగాల అధికారులతో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ చెరువులను ఆధునీకరించి మత్స్యకారులకు లాభదాయకంగా మార్చిందన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యే అవకాశముందని తెలిపారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కాసాని సుధాకర్ ముదిరాజ్, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి